

వర్షం కుండపోతగా కురుస్తోంది. కలకత్తా నగరంలో ఏది వచ్చినా విపరీతంగానే వస్తుంది. మెట్రో థియేటర్ ప్రాంగణంలో మబ్బుపట్టిన ఆకాశం వైపు విసుగ్గా చూస్తూ నిలుచుని వున్నాను. సినిమా వదిలిపెట్టడంతో జనం తొక్కిడి అధికమయ్యింది. మరో అయిదు నిముషాల తరువాత వర్షంలో తడుస్తూ ఎదురుగా వున్న ట్రామ్ డిపో వైపు అధిక సంఖ్యాకులు వెళ్ళడంతో సందడి తగ్గింది.

ఎంతసేపని ఆకాశం వైపు చూడను. అందుకని చుట్టూ చూశాను. ఆమె సినిమా నుంచి వస్తోందో లేదో ఎంతసేపటినుంచి నా వైపు ఆవిధంగా కన్నార్పకుండా చూస్తోందో తెలియదుగాని నేనామెవైపు చూడగానే పెదవులపై చిరు దరహాసం చిందించింది. దాంతో నా గుండె కలుక్కుమంది.

సాధారణంగా ఆడవారివైపు సూటిగా చూడటానికి జంకే నాలో ఏదో నూత్న శక్తి ప్రవేశించిండి. ఆమె వైపు నుంచి

దృష్టి మరల్చడం ఒకపట్టాన సాధ్యపడ లేదు నాకు.

ఆమెలో ఏదో వింత ఆకర్షణ వుంది. ఆ ఆకర్షణే నన్ను అయస్కాంతంలా కట్టి పడవేసింది. ఆమె ముందుకు అడుగు వెయ్యడం గమనించిన నేను ప్రమాదం శంకించి అతి కష్టంమీద దృష్టి రోడ్డు మీద కురుస్తున్న వర్షంమీదకి కేంద్రీకరించాను.

ఆమెవైపు నేనావిధంగా చూడడం సభ్యతకాదని హెచ్చరించడానికే ఆమె నా వైపు వస్తోందనే భయం నాలో ప్రవేశించింది. ఎంతసేపీ వర్షానికి జడవడం అని తడుస్తూనే వెళ్ళిపోతున్నారు కొందరు. మెట్రో ఆవరణలో జనం పలచబడ్డారు. సాయం సమయపు చీకట్లు కలకత్తా నగరాన్ని క్రమ క్రమంగా కబళించివేస్తున్నాయి.

ఆమె నా ప్రక్కన నిలుచుంది. నా హృదయస్పందన నాకు స్పష్టంగా వినిపిస్తోంది.

ఒకడుగు ముందుకువేసి చెయ్యి చాపి "పాడు వర్షం ఎంతకీ తగ్గడంలేదు," అందామె ఆంగ్లంలో.

ఏమన్నా అనడానికి నా కంఠం నాతో సహకరిస్తే కద. వణుకుతున్న పెదవులతో ఆమెవైపు చూశాను.

ఆమె ముఖంలో ప్రశాంతత తొంగి చూస్తోంది. ఆ చిరునవ్వు ఆమె స్నిగ్ధ సౌందర్యానికి వింత అందాన్నిస్తోంది.

"మీరెంతదాకా వెళుతున్నారు ?" అనడిగింది నా వైపు చూస్తూ.

కాస్మాపాలిటన్ నగరాలలో స్త్రీ పురుషులు యిటువంటి సమయాలలో ఈ విధంగా పలకరించుకోవడంలో ఆశ్చర్యం లేదు గానీ నాకు ఎన్నడూ యిటువంటి సంఘటన ఎదురవ్వకపోవడంతో అసలే భయపడే నేను ఆమె ప్రశ్నకి సమాధానం యివ్వలేదు.

ఆమె చిన్నబుచ్చుకున్నట్లు మొహంలో స్పష్టంగా ద్యోతకమయ్యింది.

"క్షమించండి... నాకు చిన్నప్పటి నుంచి అతివాగుడు అలవాటు. క్షణం మాట్లాడకపోతే తోచదు. మిమ్మల్ని చూస్తే ఎవరో ఆప్తుల్ని చూచినట్లుగా అనిపించింది అందుకే చొరవగా మాట్లాడాను" అంది నొచ్చుకుంటున్నట్లుగా.

అంతమందిలో ఆమె నన్నే ఆప్తుడిగా భావించడం నాకు గర్వాన్ని కలుగజేసింది. అక్కడున్న వారందరూ ఆమె కంటికి దుర్మార్గులుగా కనిపించారో లేదో గానీ నా కంటికి మాత్రం ఆ విధంగా కనిపించారు. ఆమెవైపు చూడలేక చూడలేక చూశాను ఆమె వెనక్కి అడుగు వెయ్యడంతో వెళ్ళిపోతుందేమో నన్న భయం కలిగింది నాకు.

స్త్రీ దేన్నయినా సహిస్తుంది కానీ మగవాడిలోని పిరికితనాన్ని మాత్రం సహించలేదనే వాక్యాలు గుర్తుకు వచ్చాయి. నాలోని అహం దెబ్బతింది

కంఠం సవరించుకుని 'మీరు అన్యథా భావించకండి నా స్వభావమే అంత. ఇంట్లో అందరూ నన్ను ముంగి వెధవ అంటూంటారు. మీరే చెప్పండి. యిక్కడి వంటరి జీవితంలో ఆఫీసు, రూం. పుస్తకాలు-యివే ప్రపంచమయినపుడు ఎవరైనా అంతే కదా" అన్నాను.

ఆశ్చర్యం ! ఆమెని చూస్తూ వుంటే మాటలు అవంతట అవే వస్తున్నాయి. ఆమె చిరునవ్వు నవ్వుతూ "మీరింత చక్కగా మాట్లాడుతూంటే మిమ్మల్ని ముంగి అని ఎవరన్నారు," అంది ఆశ్చర్యపోతున్నట్లుగా చూస్తూ.

ఆమె మాటలు నాలో ధైర్యాన్ని యినుమడింపజేశాయి. "నేను జతిన్‌దాస్ వీధిలో వుంటున్నాను" అన్నాను.

"నా ప్రశ్నకి యిప్పటికి సమాధానం వచ్చిందన్నమాట "అందామె చిరునవ్వు నవ్వుతూ.

నేను సిగ్గుపడ్డాను. "నేనూ అటువైపే వెళ్ళాలి. హిందూస్థాన్ పార్క్ వీధిలో వుంటున్నాను నేను" అందామె.

ఆ తరువాత మా మధ్య కొంతసేపు మౌనం తాండవమాడింది.

హఠాత్తుగా ఆమె నా వైపు తిరిగి "మీరు 'అమానుష్' చూశారా ?" అనడిగింది.

"బెంగాలీ వర్షన్ చూశాను."

"మిమ్మల్ని ఈ క్షణంలో చూస్తూ వుంటే ఉత్తమకుమార్ జ్ఞాపకం వస్తున్నాడు," అంది నవ్వుతూ.

"కృతజ్ఞుణ్ణి" అన్నాను నవ్వుతూ.

ఈసారి ఆమె నా వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"ఉత్తమకుమార్ నా అభిమాన హీరో. అతనితో నన్ను పోల్చినందుకు కృతజ్ఞుడిని. కానీ ఆ సినిమాలో అతనిలా భగ్నప్రేమికుడిని మాత్రం కాకూడదని మనసారా వాంఛిస్తున్నాను" అన్నాను నవ్వుతూ.

ఆమె కూడా నవ్వింది.

"వర్షం యిప్పట్లో తగ్గే సూచనలు కనిపించడంలేదు" అన్నాను ఆకాశం వైపు చూస్తూ.

ఇంతలో ఒక టాక్సీ అటువైపుగా వెళుతుండటం చూసిందామె. "టాక్సీ" అని కేక వేస్తూ "మీకభ్యంతరం లేకపోతే మన మిద్దరం ఒక ప్రాంతంలోనే వున్నాం కాబట్టి ఈ టాక్సీ షేర్ చేసుకుందాం" అంది.

ఆమె పక్కన కూర్చుని ప్రయాణం చెయ్యడంకన్న జీవితంలో యింకేమీ అక్కర్లేదనిపించింది నాకా క్షణంలో. మౌనంగా తల వూపాను.

టాక్సీలో మేమిద్దరం మౌనంగా కూర్చుని వుండటం టాక్సీ నడుపుతున్న సర్దార్జీకి వింతగా తోచినట్లుండి, ఒకటి రెండుసార్లు వెనక్కి తిరిగి చూశాడు.

ఆమెలో ఎటువంటి ఆలోచనలు చెల



రేగుతున్నాయో నాకు తెలియదు గానీ నాకు మాత్రం లవ్ ఎట్ ఫస్ట్ సైట్ (తొలిచూపులో ప్రేమ అందాము) అంటే అర్థమేమిటో బోధపడింది. తియ్యటి ఆలోచనలలో విహరిస్తున్న నేను ఆమె పలకరింపుతో ఉలిక్కిపడ్డాను.

"మీరు మరోవిధంగా భావించకుండా వుంటే రాష్‌బిహారీలోని ఆషాస్టోర్సు ముందు ఒక్క నిముషం ఆగుదాం. నేను చీర సెలెక్ట్ చేసి పెట్టుకున్నాను. ఇవాళ జీతాలిచ్చే రోజు కదా, ఈ రోజొచ్చి తీసుకుంటానని చెప్పాను"

"ఓ ష్యూర్... కానీ మీరివిధంగా నన్ను పరాయివారి క్రింద జమకట్టి 'మరో విధంగా అనుకోకండి... మరో విధంగా భావించకండి' అని అనకుండా వుంటే బాలు" అన్నాను.

"మన పరిచయమయి అరగంట కూడా కాలేదు," అందామె నవ్వుతూ.

నాకు మాత్రం యిది జన్మ జన్మల అనుబంధంలా వుంది," ఆ మాట అంటూంటే నా గొంతు బొంగురు పోయింది. ఆ తరువాత ఆమె ఏమనుకుంటుందోనని సిగ్గుపడ్డాను.

ఆమె నా వైపు చూసి చిరునవ్వు నవ్వుతూ "నేను చెప్పలేకపోయాను. మీరు చెప్పారు" అంది.

నాలో ఆశాలత తలుక్కుమంది. ఆమె వైపు చూసి ఏదో చెప్పబోయాను. ఆషా స్టోర్స్ సమీపించడంతో నేను మౌనం వహించాను.

ఆమె టాక్సీ దిగుతూంటే "నేనూ వస్తాను," అంటూ ఆమె వెనుకే వెళ్లాను. ఆమె చెప్పినట్లు ముందుగానే చీర ఎంచుకోవడంవలన అంతగా ఆలస్యమవలేదు.

"ఈ చీర నాకు బాగుంటుందా?" అనడిగిందామె.

"మీరు కట్టుకుంటే ఈ చీరకి అందం వస్తుంది. కానీ ఒక్కటే కొరత" అన్నాను గంభీరంగా.

ఆమె ప్రశ్నార్థకంగా నా వైపు చూసింది.

"ఆ బిల్లు నా చేతికిస్తే ఆ కొరత తీరుతుంది..." అంటూ ఆమె చేతిలోని బిల్లు వైపు చూశాను.

ఆమె విస్తుపోయి నా వైపు చూసింది-

"నో...నో... నేను చీర కొనుక్కుంటే మీరు ఖరీదు చెల్లించడ మేమిటి?" అంది.

నేను గతుక్కుమన్నాను. "క్షమించండి. నేను మరో ఉద్దేశ్యంతో అన లేదు. మన స్నేహ చిహ్నంగా కానుక యిద్దామనిపించింది. నాకు చిన్నప్పటి నుంచి యిదొక చెడ్డ అలవాటు" అన్నాను.

"ఏమిటి... ఆడపిల్లలకి కానుక లివ్వటమా?" అంది నవ్వాపుకుంటూ.

నా మొహం ఎర్రబడింది. ఆమె అది చూసి విరగబడి నవ్వింది. ఆమె నవ్వుతూంటే మరింత అందంగా కనిపించింది నాకు.

"నన్నింత అపహాస్యం పాల్జేసిన తరువాతయినా ఆ బిల్లు నా చేతికిస్తారా?" అన్నాను.

ఆమె తల అడ్డంగా తిప్పడంతో నాలోని అహం దెబ్బతింది. చటుక్కున ఆమె చేతిలోని బిల్లు లాక్కుని చూశాను. ఆరవై రూపాయల చిల్లర అయింది. ఆ రోజే జీతం రావడం వలన పర్సు బరువుగా వుంది. సందేహించకుండా ఖరీదు చెల్లించాను. ఆమె నావైపు అసంతృప్తిగా చూడడం గమనించాను కాని నేనది ఖాతరు చెయ్యలేదు.

ఇద్దరం టాక్సీలోకి జొరబడ్డాం. వర్షం అప్పటికి కాస్త తగ్గుముఖం పడుతోంది.

"కోపమా?" అనడిగాను.

"ఇటువంటి పనులు చేస్తే ఎవరికి కోపం రాదేమిటి?" అందామె.

"ఈ సారికి క్షమించి వదిలెయ్యి."

"అదిగో... ఒక బహుమతి యివ్వగానే ఏకవచన ప్రయోగమా?" అందామె నవ్వుతూ.

"ఐయామ్ సారీ."

"నో...నో... నాకు ఆ విధంగా పలకరిస్తేనే బాగుంది."

హిందుస్థాన్ పార్కులో ఎటువైపు మీ యిల్లు?" అనడిగాను.

"అదిగో ఆ ఎదురుగుండా కనిపిస్తున్న యిల్లే..." గ్రౌండ్ ఫ్లోర్‌లో వుంటున్నాం.అంటూ టాక్సీవాడికి సూచన లిచ్చి ఆపుతూ" లోపలికి వచ్చి ఒక కప్పు టీ సేవిస్తే ధన్యురాలి నవుతాను," అందామె నవ్వుతూ.

అటువంటి ఆహ్వానానికే ఎదురు చూస్తున్న నేను చటుక్కున క్రిందికి దిగి టాక్సీవాడికి మీటరు చెల్లించబోయాను.

"పోనీ ఆ పనయినా నన్ను చెయ్య నిస్తారా?" అందామె.

"నో...నో."

"మనం షేర్ టాక్సీలో వచ్చాం కాబట్టి షేర్ చేసుకుందాం." అంటూ బలవంతాన మూడు రూపాయలు నా చేతిలో కుక్కి తలుపు తాళం తీసింది.

"ఎవరూ లేరేమిటి?" అనడిగాను, ఎవరూ లేకపోతేనే బాగుండుననిపించిన నేను.

"నేనూ అమ్మ మాత్రమే వుంటు న్నాం. అమ్మ బెనారస్ వెళ్ళింది," అందామె చిరునవ్వు నవ్వుతూ.

"ఎందుకూ?"

"చేసిన పాపాలు క్షమించమని, చేస్తున్న పాపాలు చూడకుండా వది లెయ్యమని ఆ విశ్వేశ్వరుని కోరుకో డానికి కాబోలు"

"ఛ... అవేం మాటలు" అన్నాను.

మాగజైన్స్ చూస్తూ వుండండి. చిటి కెలో వచ్చేస్తాను." అంటూ లోపలికి వెళ్ళింది.

నేను సోఫాలో కూర్చుని ఫిలిమ్‌ఫేర్ తిరగేస్తున్నానన్న మాటే గాని నా మన స్సంతా ఆమె మీదే వుంది.

పదిహేను నిముషాల తరువాత ట్రేతో పాటు వచ్చిన ఆమెతో "ఇదేనా చిటికెలో రావడం..." అంటూ ఆమె వైపు చూసి ఆగిపోయాను

ఆమె నేను కానుకగా యిచ్చిన చీర కట్టుకుంది. ఆ చీరలో ఆమె అందం ద్విగుణీకృతమయ్యింది. నా గుండె లెందుకో దడదడలాడాయి.

ఆమె నావైపు చూసి చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వు నా మీద సమ్మో హనాస్త్రంలా పనిచేసింది.

అది ప్రేమో... ఇన్‌ఫాట్యుయేషనో తెలియని అయోమయావస్థలో పడ్డాను. అదేదయితే నాకేం... ఆమె నాకు కావాలి. ఆమె లేనిదే జీవితం అంధకార మన్నట్లుంది నాకు.

"ఇవన్నీ ఎందుకు?" అనడిగాను సింగడాలు, స్వీట్స్‌వైపు చూస్తూ.

"తినడానికి" అంటూ నవ్విందామె. నేను రోషంగా మొహంపెట్టడంతో పగలబడి నవ్విందామె. అలా వూగి పోతూ నవ్వుతూంటె ఆమె పమిట క్రిందకి జారింది. లోనెక్ జాకెట్ ఆమె సౌందర్యలహరిని బహిర్గతపరుస్తోంది. నా కంఠం పొడారిపోయింది. ఆమె నా అవస్థ నెంతమాత్రం పట్టించుకోకుండా,

"సింగడాలంటే నాకిష్టం," అంటూ ట్రేలోని ప్లేటు మా మధ్యన పెట్టి టీ కప్పులలోకి కెటిల్‌లోంచి టీ నీరు వంచింది. ఇన్ని చేస్తున్నా ఆమె పయిట కప్పుకోవడం మాత్రం చెయ్యలేదు.

నేను ఆమె వైపు చూడలేక టీ కప్పు వైపు దృష్టి మరల్చాను. నా చేతులు వణుకుతున్నాయి. ఆ వణుకుపాటు కప్పి

పుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాను నేను

"టీ చాలా బాగుంది" అన్నాను. వెచ్చటి తేనీరు త్రాగిన తరువాత కొంత స్వాస్థ్యం లభించింది నాకు

"థాంక్స్... కానీ చీరగురించేం చెప్పలేదు " అంది చిరునవ్వుతో.

అప్రయత్నంగా తల పైకెత్తాను థాంక్ గాడ్ ! ఆమె నా అవస్థ గమనించి నట్లుంది పయిట నిండుగా కప్పుకుంది

"యూ ఆర్ మార్వెలస్" అన్నాను

"నేను చీరగురించి అడిగాను " చిలిపిగా అందామె

"యూ ఆర్ లుకింగ్ మార్వెలస్... ఓకే" అన్నాను

"రియల్లీ "

"నాకు అబద్ధం చెప్పడం చాతకాదు "

అంటూనే ఎంత పచ్చి అబద్ధం చెప్పారు" అంది నవ్వుతూ

ఆ తరువాత మరో పదినిముషాలు సరదాగా మాట్లాడుకున్నాం ఆమె ఎదురుగా వుంటే నాకు కదలాలనిపించడం లేదు ఎందుకో ఆమె వైపు చూస్తూ అట్లాగే కూర్చుండిపోవా లనిపిస్తోంది

"నేనిక వెళ్తాను," అన్నాను అయిష్టంగా లేచి నిల్చుంటూ

"అంత వర్షం కురుస్తూంటే ఎక్కడికి వెళతారు?" అంటూ కిటికీలోంచి బయటకి చూసింది వర్షం బాగా పెద్దదయింది

"వర్షం కాస్త తగ్గాక వెళ్ళొచ్చు" అంటున్న ఆమె మాటలు కాదనలేక సోఫాలో కూలబడ్డాను

"దేశంలో మరో మూల 'వర్షమో రామచంద్రా' అని గొడవపెడుతూ వుంటే అక్కడ కురవకుండా కుండపోతగా యిక్కడ కురుస్తోంది" అందామె నవ్వుతూ

నేను ఏదో ఒకటి అనేలోపలే కరెంటు పోయింది

"ఛ...ఛ .. ఈ కరెంట్ ఒకటి... పోతే రెండుమూడు గంటలదాకా దిక్కుండదు " అని విసుక్కుంటూ "కొవ్వొత్తులు తీసుకు వస్తానుండండి" అంటూ లేచి నిలుచుందామె

వర్షం బాగా ఎక్కువయింది చలిగాలి రివ్వున వీస్తోంది ఉన్నట్లుండి వస్తున్న మెరుపులు తప్ప చుట్టూ గాఢాంధకారంగా వుంది.

కొవ్వొత్తులకోసం వెళ్ళబోయిన ఆమె టీపాయ్ తగిలి క్రిందపడబోయింది నేను చటుక్కున ఆమెని పట్టుకున్నాను నా శరీరం ఆమె స్పర్శతో గగుర్పొడిచింది. నా పట్టునుండి విడిపించుకునేందుకు ఆమె ప్రయత్నం చెయ్యలేదు కొన్ని సెకన్లు ఆ విధంగా మా మధ్య దొర్లాయి

ఇంతలో ఉన్నట్లుండి పిడుగుతో పాటు మెరుపు మెరిసింది ఆమె చటుక్కున నా కౌగిలిలో ఒదిగిపోయింది.



నేనామె వెన్ను నిమురుతూ గాఢంగా నా బాహువుల మధ్య బంధించి వేశాను

నా పెదవులు ఆమె అధరాలతో కలవడానికి ఉత్సుకత చూపుతున్నాయి

మనం ఎదురు చూడని సంఘటనలు, అవకాశాలు అప్పుడప్పుడు తారసపడుతూవుంటాయి. అందులో నిండు యవ్వనంలో వున్న యిరువురు స్త్రీ పురుషులకి వారికి కావలసిన దేమిటో తెలిసిన తరువాత యిటువంటి అవకాశం ఎదురుపడితే దాని నొక మరుపురాని సంఘటనగా మలచుకోవడం వారి ఆవేశోద్వేగాలమీద ఆధారపడి వుంటుంది.

మా యిరువురి మధ్య ఆవేశానికి—ఉద్వేగానికి కొరతేం లేదనిపించింది నాకు విరజిమ్ముతున్న సెగల పొగల అనుభూతి చూసిన తరువాత.

బయట వీస్తున్న పెనుగాలి తలుపు లనే ద్వారాలు మూసుకున్నాయి అదే సమయంలో వలపు అనే ద్వారం మా యిరువురి మధ్య తెరుచుకుని మమ్మల్ని కవ్విస్తూ ఆహ్వానించింది

లైట్లు వెలిగి అరగంట పైనే అయి వుంటుంది మరో లోకంలో విహరిస్తున్న మేము చటుక్కున స్పృహవచ్చిన వారిలా విడివడ్డాము

ఆమె నాకు దూరంగా జరిగింది నా బలహీనతకి సిగ్గుపడ్డాను ఆమె వైపు చాలా సేపటివరకు చూడలేకపోయాను.

ఆ తరువాత ఆమెని సమీపించి "నన్ను క్షమించు... ఆవేశంలో చెయ్య కూడని పని చేశాను" అన్నాను

"అందుకు నా సహకారమూ వుందిగా" అంది చిరునవ్వు నవ్వుతూ.

ఆమె మోములో ఆ క్షణంలో కూడా చిరునవ్వు ప్రత్యక్షమవడం నాకు ఆశ్చ ర్యాన్ని కలుగజేసింది

ఆవేశంతో ఆమె చెయ్యి పట్టుకుని "నీకు నేను అన్యాయం చెయ్యను" అన్నాను

ఆమె తదేకంగా నా వైపు చూసింది

'నిన్ను తప్పకుండా పెళ్ళిచేసు కుంటాను'' అన్నాను, ఆమె నమ్మటం లేదన్న బాధతో

ఆమె పేలవంగా నవ్వింది.

"ప్లీజ్ నన్ను నమ్మవూ" అన్నాను ఆమె చేతులు పట్టుకుంటూ

ఆమె బాధగా నవ్వుతూ..." నమ్మి ప్రయోజనం లేదు" అంది

ఆమె కే విధంగా నచ్చచెప్పాలో తెలియలేదు నాకు "ప్లీజ్" అన్నాను.

"వర్షం తగ్గినట్లుంది " ముభావంగా అందామె

"నేను నిన్ను పెళ్ళిచేసుకుంటాను." మరోసారి దృఢస్వరంతో అన్నాను.

ఆమె హృదయంలో అగ్నిపర్వతాలు చెలరేగుతున్నాయి "దయచేసి నన్నొంట రిగా వదలి వెళతారా ?" అంది

నే నామెవైపు చూసి ఏదో చెప్ప బోయాను

"ప్లీజ్" అందామె.

ఆమె పరిస్థితి ఊహించాను. ఆ సమ యంలో ఏ స్త్రీ అయినా ఒంటరితనాన్ని అభిలషించడం సహజం మౌనంగా, భారంగా అడుగులు వేస్తూ తలుపుదాకా వెళ్ళాను వెనక్కి తిరిగి చూసిన నాకు శూన్యంలోకి చూస్తున్న ఆమెని చూడ గానే ఆమె దగ్గరకెళ్ళి ఆమెని నా కౌగి లిలో బంధించి ధైర్యం చెబుదామన్న కోరిక కలిగింది అతి కష్టంమీద ఆ కోరిక చంపుకుని బయటపడ్డాను

* * *

మరునాడు సాయంత్రం ఆఫీసు నుంచి త్వర త్వరగా బయటపడి రూంకి వచ్చి ముస్తాబు చేసుకుని ఆమె కిష్టమైన సింగడాల పొట్లం కట్టించుకుని హిందూస్థాన్ పార్క్ వైపు బయల్దేరాను.

వర్షం జల్లు నాలు గత సాయంత్రపు తియ్యటి సంఘటనని గుర్తుకు తెస్తోంది.

ఈపాటికి ఆమె మనో నిబ్బరం తెచ్చుకుని వుంటుంది. ఆమెతో జీవితం ఆనందమయం చేసుకుంటాను. ఇన్నాళ్లకు జీవితంలో పోగొట్టుకున్న వస్తువేదో దొరికిన అనుభూతి నాలో కలుగుతోంది. ఆమె కోసమే నేను, నా కోసమే ఆమె జన్మించామనిపించింది నాకు.

ఆమె నా కోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఇంత ఆలస్యంగా వచ్చినందుకు బుంగమూతి పెడుతూ అలక వహిస్తుంది — ఈ విధంగా ఆలోచిస్తూ వెళుతున్న నాకు హఠాత్తుగా ఒక విషయం జ్ఞాపకంవచ్చి నవ్వొచ్చింది.

ఇంతవరకు ఆమె పేరు నాకు తెలియదు. నా పేరు ఆమెకి తెలియదు!

పేర్లు తెలియకుండా ప్రేమేమిటి?

అయినా ప్రేమకి పేర్లెందుకు? — ఆ ఆకర్షణ అటువంటిది- నన్ను నేను సమర్థించుకున్నాను.

ఆమె ఇల్లు సమీపించాను. నిన్న నేనిచ్చిన చీర ఆమెకి ఎంత బాగా నచ్చింది. ఆమె బహుశా ఆ చీరే కట్టుకుని వుంటుంది.

ఆమె మోములో ఎంతటి ప్రశాంతత వుంది. తీర్చి దిద్దిన ఆ సౌందర్య రాశి లభించడం నిజంగా నా అదృష్టం.

ఆమె యింటి గుమ్మం సమీపించాను. తలు మూసివుంది. మృదువుగా తలుపు తట్టాను. ఆమెకి వినిపించినట్లు లేదు.

ఇంతలో నాలో ఒక చిలిపి ఆలోచన ప్రవేశించింది. కిటికీ దగ్గర్నుంచి సకిలింతలు చేసి ఆమెని భయ భ్రాంతురాలిని చేద్దామనుకున్నాను నేను.

కానీ...

ఆమెని దిగ్భ్రాంతురాలిని చేద్దామనుకుని కిటికీవైపు వెళ్ళిన నేను దిగ్భ్రాంతి చెందాను. నా చేతిలోని సింగడాల పొట్లం నలిగిపోతోంది. నా కాళ్ళు వణుకుతున్నాయి.

నా మనస్సులాగే పొట్లంలోని సింగడాలు చితికిపోతున్నాయి.

ఆమె నేను బహూకరించిన చీర విప్పుతోంది. ఎదురుగా బల్లమీద అంతకన్న ఖరీదయిన చీర వుంది.

ఆమె దృష్టి ఆ చీర మీద వుంది.

ఆమె కెదురుగా నల్లటి దుబ్బుమీసాల బెంగాలీబాబు ఆమెని నమిలి మింగేసేట్లు చూస్తూ కూర్చుని వున్నాడు.